

# పూర్ణానందం - జాతకచక్రం

- ప్రకాష్

బ్యాచిలరు అనగానే ఇల్లు ఖాళీ లేదు పొమ్మంటూ, పెళ్ళికాని కుర్రాళ్ళంటే టెర్ర
లిస్టుల్ని చూసినట్టుచూసే ఈ రోజుల్లో ఫ్యామిలీలలో కళకళ లాడిపోయే వీధిలో
రూము సంపాదించడమే కాకుండా గత నాలుగేళ్ళుగా పెళ్ళికెదిగిన కూతుళ్ళు
వున్న తల్లిదండ్రుల నుంచి 'కుర్రాడు బుద్ధిమంతుడు', మంచివాడు లాంటి సర్టిఫి
కెట్లని కొట్టేసి బ్యాచిలర్స్‌కి ఇల్లు అద్దెకివ్వకూడదన్న అభిప్రాయం కల ఇంటివోనర్ల
అంచనాలను తల్లక్రిందులు చేసిపారేసి అంతటితో ఆగకుండా సదరు అభిప్రాయాన్ని
బంగాళాఖాతంలో ముంచేసిన ఘనుడు పూర్ణానందం.

పూర్ణానందం మంచితనాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే తల్లిదండ్రుల మీద గౌరవంతో, భక్తితో ఈ జీవితం వాళ్ళు ప్రసాదించిందే అన్న అంకిత భావంతో ఇరవై తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకొని ముచ్చటగా మూడు పదులలోకి అడుగుపెట్టి కూడా నాకు వయసైపోతుంది తొందరగా పెళ్ళి చేసేయండి అంటూ ఇంటికప్పు మీదకెక్కి అరవకుండా వాళ్ళు చేసే ప్రయత్నాలు వాళ్ళు చేస్తున్నారు. నాకింకా పెళ్ళి ఘడియ రాలేదు కాబోలు అనుకుంటూ మెట్ట వేదాంతాన్ని నమ్మిన ఉత్తముడు. అలాగని పూర్తిగా అమాయకుడేంకాదు లేండి ఇరవై రెండేళ్ళకి ఎం.ఏ. పూర్తిచేసి మరో మూడేళ్ళలో లంచాలు, రికమండేషనుల్లాంటి దొడ్డిదార్లో కాకుండా స్వయంగా తన తెలివి తేటల్తోనే గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించుకుని జీవితంలో స్థిరపడ్డవాడే. కాకపోతే చిన్నప్పట్నుంచి మిలట్రీ డిసిప్లిన్‌లో పెరిగాడు గాబట్టి ఉద్యోగం వచ్చి నాలుగేళ్ళయినా ఉద్యోగరీత్యా తల్లిదండ్రులకు దూరంగా వుంటున్నా పేరంట్సు పెంపకం ప్రభావం ఇంకా అతని మీద బలంగానే పనిచేస్తుంది.

* * *

మనం మంచివాళ్ళమైనంత మాత్రాన పక్కింటి పిన్నిగారు, ఎదురింటి ఆంటీగారు పై పోర్షన్‌లో వుండేసాపాయమ్మగారు మంచివాళ్ళు. అవ్వాలని రూలేం లేదుగా పాపం పూర్ణానందం విషయంలో కూడా అక్షరాలా అదే జరిగింది. నాలుగేళ్ళుగా ఆ వీధిలోనే అదే రూంలో వుంటూ కూడా ఎవ్వడైనా ఎవరితోనైనా మాట్లాడడం కాదు గదా కనీసం తలెత్తి ఎవరి వైపు కూడా చూడని పూర్ణానందానికి ఆ రోజు ఘోరమైన అవమానం జరిగిపోయింది.

పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూశాడేగాని టైమయిపోయిందన్న హడావిడిలో యమస్పీడుగా ఆఫీసుకు వెళ్తుంటే సడన్‌గా గాంధీబొమ్మ సెంటర్లో అమ్మాయిల గుంపొకటి అతన్ని చుట్టు ముట్టేసింది. చూడ్డానికి అందరూ కాలేజీ స్టూడెంట్సు లాగే వున్నారు. అందరి చేతుల్లోను పుస్తకాలున్నాయి. సీతాకోక చిలుకల్లాంటి ఆ అమ్మాయిల గుంపులోంచి వరూధిని లాంటి అమ్మాయి ముందుకొచ్చి " ట్యూషన్‌లో మా ఫ్రెండ్స్‌తో పందెంకట్టి ఓడిపోయాను. అందుకని వీళ్ళనందర్ని సినిమాకు తీసుకెళ్ళాల్సి వచ్చింది. ఇంటికెళ్ళి రావడానికి టైమ్ చాలదు. మీ దగ్గర యాభై రూపాయిలుంటే ఇవ్వండి సాయంత్రం ఇంటి దగ్గర ఇచ్చేస్తాను" అని ముద్దుముద్దుగా అడిగింది. పూర్ణానందంలా పెళ్ళికాకుండా వున్న మరో కుర్రాడెవరయినా వరూధినుల గుంపులా వున్న అమ్మాయిల్ని చూసి ఫ్రిజ్ లోంచి తీసి బైటపెట్టిన ఐస్‌క్రీం లాగా కరగిపోయి స్టయిల్‌గా జేబులోంచి వంద కాయితాన్ని తీసి ఇచ్చేవాడే. కాని పూర్ణానందం క్రమశిక్షణతో పెరిగినవాడు కాబట్టి అడిగింది అందమైన అమ్మాయి అన్న విషయానికన్నా అసలా అమ్మాయి ఎవరు? తను ఎప్పుడైనా ఎక్కడైనా ఆ అమ్మాయిని చూసి వున్నానా? అసలీమె ఎవరి తాలూకు లాంటి ఆలోచనలతో రెండు నిమిషాల సేపు బుర్రపాడుచేసుకుని ఆ అమ్మాయి తాలూకు వివరాలు ఎంతకూ గుర్తుకు రాకపోయేసరికి "సారీ మీరెవరో గుర్తుకు రావడంలేదు. మిమ్మల్ని ఇదివరకు ఎక్కడ చూశాను?" అంటూ ప్రశ్నించేశాడు. దాంతో అప్పటి వరకు సినిమాకి వెళ్ళబోతున్నామన్న ఉత్సాహంతో మెర్క్యురీలైటులా వెలిగిపోయిన అమ్మాయి ముఖం కాస్త ఫోటో స్టూడియోలోని డార్క్ రూంలాగా నల్లగా మారిపోయి నిస్సహాయంగా తన స్నేహితులవైపు చూసింది. "ఇతను నీకు బాగా తెలిసిన వాడన్నావు. పైగా మీ ఎదురింట్లోనే వుంటున్నాడన్నావు. ఈయన గారేమో అసలు నువ్వెవరో తెలీదంటున్నాడు 'ఏమిటీ న్యూసెన్సు" అంటూ స్నేహితులంతా కళ్ళతోనే ప్రశ్నించేసరికి మొగుడు కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకన్నట్టుతన ఫ్రండ్సు ముందు అవమానం జరిగేసరికి తట్టుకోలేక ఎక్కడలేని కోపం తెచ్చుకొని ఆ కోపంలోనే నేరుగా ఇంటికి వెళ్ళి ఆ వీధిలో వుండే పబ్లిక్ కుళాయి దగ్గరి గుంపుకు రింగ్ లీడరయిన తల్లితో బజార్లో జరిగిన అవమానాన్ని హృదయవిదారకంగా విలపిస్తూ చెప్పేసింది. చెట్టంత కూతురు అలా ఏడ్చేసరికి రింగ్ లీడర్ గారు కాస్త అపరలంకిణిగా మారిపోయి పూర్ణానందం వచ్చేవరకు అతని రూం దగ్గరే కాపలాకాసి పూర్ణానందం కనబడగానే ఎటాక్ ఇచ్చేసింది. ఏరా నీ కళ్ళకి మేం ఎలా కనిపించాం? నీ బోడి యాభై రూపాయల్తో వూరొదిలి పారిపోతాం అనుకున్నావా? నాలుగేళ్ళ నుంచి ఇక్కడే తగలడ్డావుగా ఆ మాత్రం ఎదురింటో వుండే అమ్మాయే తెలీదా? పైగా అమ్మాయివైపు చూసి పళ్ళికిలిస్తూ. కన్నుకొడతావా ఎంత ధైర్యంరా నీకు. మరోసారి ఇట్లాంటి పిచ్చి వేషాలేశావంటే కాళ్ళు చేతులు విరగ్గొటి పంపుతాను జాగ్రత్త అంటూ లంకిణిగారు వీధిలో నిలబడి అందరికి వినపడేట్టుగా పెద్దపెద్ద కేకలు పెడ్తుంటే సరికి దిక్కుతోచని పూర్ణానందం "అదికాదండి. మీ అమ్మాయిని" అంటూ ఏదో చెప్పబోయేసరికి "మళ్ళినోరెత్తావంటే వూరుకోను" అంటూ ఫైనల్ వార్నింగ్ ఇచ్చేసి పక్కనేవున్న కూతురు వైపుచూసి మందలిస్తున్నట్టుగా అయినా నీకు మాత్రం బుద్ధుండక్కర్లేదే పోయి పోయి ఇలాంటి బికారి వెధవల్నీ అడగాలా అంటూ రుసరుసలాడుతూ కూతురు చేయి పట్టుకుని ఇంట్లోకి లాక్కెళ్ళిపోయింది. అప్పటి వరకు లంకిణిగారికి బజార్లో జరిగింది చెప్పాలని ప్రయత్నించిన పూర్ణానందం ఆమె వెళ్ళిపోవడంతో చేసేదేంలేక రావణాసురుడి సభలో భంగపడ్డ విభీషణుడిలా అవమాన భారంతోతలదించుకుని నిదానంగా అడుగులు వేసుకుంటూ రూములోకి వెళ్ళాడు.

* * *

మంచంమీద పడుకున్నాడన్న మాటేకాని పదేపదే లంకిణిగారి అరుపులు చెవుల్లో హోరెత్తిస్తుండడంతో నిద్రపట్టలేదు పూర్ణానందానికి. పుట్టి బుద్దెరిగి తరువాత ఎదుటివాళ్ళచేత ఎప్పుడూ మాటపడి ఎరగడు. అలాంటిది జరిగింది తల్చుకుంటుంటే నిద్రరావట్లేదు సరికదా పొద్దున్న ఆఫీసుకు వెళ్తూ వండి పెట్టుకున్న అన్నం, కూర సంగతి కూడా పూర్తిగా మర్చిపోయి మంచంమీదే అటూ ఇటు దొర్లసాగాడు. కష్టాలెప్పుడూ ఒంటరిగా రావంటారు. అసలే సాయంత్రం జరిగిన గొడవకి తెగబాధపడిపోతున్న పూర్ణానందానికి పులిమీద పుట్రలా వెంటనే మరో కష్టం బల్లి రూపంలో వచ్చి మీద పడింది. గాల్లోకి లేచిన బంతిని పట్టుకోవడానికి పరిగెత్తి పడిపోయిన క్రికెటర్‌లా గోడకు దగ్గరగా

## పూజారి

నా హృది
గతమనే కన్నీటికి తడిసి
ఏళ్ళబద్దు విశిరాతిరికి జడిసి
మువ్వున్నావనే భావనతు భ్రమసి...
నీటిపైని ఆలైన నీ ఊసులకై
అన్నీ అడియాసలైన మన బాసలకై
కన్నీటి ఊట కరువైనా విలపిస్తోంది!

విలాపంలోనూ వలపు వెన్నెల్ని వెదజల్లే
నీ కనుదోయి జాబిల్లి కోసం
వను దాసుడ్ని చేసే నీ సాన్నిధ్యం కోసం
నీ జ్ఞాపకాలకాలవాలమైన ఈ వాకిటి ముంగిట
ఆహ్లాదాహ్వానాల కళ్ళాపి జల్లి
సుస్వాగతాల పలకరింతల ముగ్గుల్నేసి
నా దోసిట పులకరింతల పుష్పాలనుంచి
విరహానల ధూపం వేసి...
జ్ఞాపకాల మాలను - నీ మెళ్ళో వేయాలని
స్పందనల గంధాలను - నీ మేన రాయాలని
విరహపుటనుభూతుల్తో - అభిషేకం చేయాలని
అనురాగపుటాలాపనల్తో - హారతివివ్వాలని
మన ప్రణవ మంత్రాల్తో - నీ పూజ చేయాలని
కనులు కాయలు కాచినా
నీకై కాచుకుని
వేచి చూస్తోన్న అభిసారిని-
నీ పూజారిని!

— ఎన్. సంజీవ్, ఐ.డి. ఎస్సీ.

ఎగురుతున్న పురుగును పట్టుకోవాలనే ప్రయత్నంలో పట్టు తప్పిపోయిన బల్లిగారు గోడపక్కనే వేసివున్న మంచం మీద పడుకొని దొర్లుతున్న పూర్ణానందం మీద పడిపోయింది. లంకిణిగారి ఆలోచనల్తో పరధ్యానంగా వున్న పూర్ణానందం మీద ఏదో పడినట్టు అనిపించడంతో చేత్తో బల్లిపడ్డ ప్రదేశాన్ని దులిపేసుకుంటూనే ఎందుకో అప్రయత్నంగా పక్కకు చూసేసరికి అప్పుడే మంచం మీద నుంచి గోడమీదకు పాకుతున్న బల్లికనబడింది. అంతే ఒక్క వుదుటున మంచం మీద నుంచి కిందకు దూకేసి మంచాన్ని రూం మధ్యలోకి లాగేశాడు.

బల్లంటే భవిష్యత్తును తెలియచేసే కంప్యూటర్ జోతిష్యం లాంటిదని, భవిష్యత్తులో మనకు జరగబోయే మంచి చెడులను తెలియచెప్పడానికి అది మీద పడుతుందని పూర్ణానందం ప్రగాఢ విశ్వాసం. బల్లిశాస్త్రాన్ని నమ్మే వాళ్ళనందర్ని ఒక చోట నిలబెట్టి వాళ్ళందరి మీద బల్లుల్ని కనక తెచ్చి పడేస్తే అందరికంటే ఎక్కువగా భయపడిపోయి బల్లిజోతిష్యాన్ని నమ్మేవాళ్ళందర్లోకి 'బెస్ట్ క్యాండిడేట్' అని అనిపించుకునేటంత గొప్ప నమ్మకం పూర్ణానందానికి బల్లంటే.

మొదట్లో అంటే పూర్ణానందం చదువుకునే రోజుల్లో మూఢనమ్మకాల్ని తేలిగ్గా కొట్టిపారేస్తూ 'బల్లిశాస్త్రం లేదు. తొండశాస్త్రం లేదు' అని అన్నవాడే. కాని అరవై అయిదేళ్ళ వయస్సులో కూడా నీరసం అంటే ఏదిటో తెలీకుండా శుభ్రంగా తినేస్తూ ఎప్పుడూ ఏదో ఒక పనిచేస్తూ తిరుగుతుండే పూర్ణానందం నాయనమ్మగారి మీదఒకసారి బల్లిపడింది. కంచిలోని బంగారు బల్లిని తాకి వచ్చిన వాళ్ళ తాతయ్య అంతకు ముందే చనిపోవడం, తాతయ్య తప్పించి ఇంట్లో వాళ్ళెవ్వరూ కంచికిపోకపోవడంతో పాపం నాయనమ్మగారికి బల్లిదోషం నుంచి తప్పించుకునే అవకాశం లేకపోయింది. అదీ కాక పెద్ద బాలశిక్షలో వుండే బల్లి శకునంలో నాయనమ్మగారి వంటి మీద బల్లి పడిన ప్రదేశాన్ని బట్టి ఆమెకు మరణప్రాప్తి అని వ్రాసి వుండే సరికి చావు భయం పట్టుకున్న నాయనమ్మగారు ఎంగిలి పడడం కూడా మానేసి తెగ దిగులు పడిపోతూ వుండే సరికి పిల్లిశకునం, బల్లి శకునం అంటూ ఈ వయసులో తిండి తిప్పలు మానేసి కూర్చున్నావంటే బల్లిగార ప్రభావమెమోకాని నువ్వు మాత్రం నీరసంతో చచ్చిపోవడం ఖాయం" అని చెప్పి బల్లి మీద, పిల్లిమీద అనర్గళంగా ఓ పది నిమిషాలు లెక్చరిచ్చి ఎలాగైతేనేం నాయనమ్మగారు కంచం ముందు కూర్చొని కాస్త తినేట్టు చేయగలిగాడు పూర్ణానందం. నాలుగు రోజులు గడిచి ఇంట్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో చూశావా నాయనమ్మ అనవసరంగా భయపడిపోయి చేజేతులా ఆరోగ్యాన్ని చెడగొట్టుకునే దానివే. ఇప్పుడు చెప్పు మీ బల్లిగారు శాస్త్రం ఎంతవరకు కరెక్టు? అని మనవడు పూర్ణానందం ప్రశ్నించేసరికి మనసులో ఇంకా బల్లిభయం పీడిస్తున్నా పైకి మాత్రం బోసి నవ్వు నవ్వేసింది నాయనమ్మ. మరో రెండ్రోజులు ప్రశాంతంగా గడిచిపోయే సరికి ఆమెలోని భయం కూడా కొంచెం కొంచెం విడిపోతున్న సమయంలో మూడో రోజు పొద్దున్నే ఘోరం జరిగిపోయింది. పొద్దున్నే నీళ్ళ కోసం పెరట్లో వున్న బావి దగ్గరకు వెళ్ళిన నాయనమ్మగారు చూసుకోకుండా బావి చుట్టూ కట్టిన చప్టా మీదున్న పాకుడు మీద కాలువేయడంతో కాలు జారిన నాయనమ్మగారు అలాగే వెనక్కు విరుచుకు పడిపోవడంతో ఆమె తలవెళ్ళి పక్కనే వున్న బట్టలుతికే బండకు కొట్టుకుని అక్కడి కక్కడే ప్రాణాలొదిలేసిందామే. బల్లిమీద పడడానికి, నాయనమ్మగారు చనిపోవడానికి ఎలాంటి సంబంధం లేకపోయినా బల్లిపడిన వారం రోజులకే నాయనమ్మగారు చనిపోవడంతో బామ్మగారి మరణం వెనుక బల్లిగారి హస్తం వుందనే ధృడ నిశ్చయానికి వచ్చేసిన పూర్ణానందం అప్పట్నుంచి బల్లిని చూస్తే చాలు యముని మహిషపు లోహపు గంటల శబ్దాలు చాలా దగ్గర్నుంచి వినిపిస్తున్న భ్రాంతికి లోనై భయంతో గడగడలాడి పోతాడు.

బల్లిని చూస్తేనే అంతగా భయపడిపోయే పూర్ణానందం మీద ఏకంగా బల్లి మీద పడేసరికి బల్లిగారు, నాయనమ్మ, బట్టలుతికే బండ గుర్తుకు వస్తుండడంతో రేపుఏం జరగబోతున్నదోనన్న విచారంతో రాత్రంతా రెప్పవాల్చకుండా తమవంతు ప్రయత్నం చేసి ఇక బతకటానికి ఎటువంటి అవకాశం లేక ఎగశ్వాశలోకి దిగిన పేషంటు ఆఖరి శ్వాసకోసం ఎదురు చూస్తున్న డాక్టర్లా ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూస్తూ రాత్రంతా శివరాత్రి జాగారణ చేసేశాడు.

* * *

సిద్దేశ్వరయోగిగారి జ్యోతిష్యాలయం:-

ఇచ్చట అరచేయి, ముఖం, కళ్ళు ముక్కు, చెవి, వీపు, తొడ, అరికాళ్ళుశరీరంలోని ఏ భాగం చూసైనా జాతకములు చెప్పబడును. సంఖ్యాశాస్త్రి జోతిష్యం మా ప్రత్యేకత.


ఇట్లు
జ్యోతిష్యశాస్త్రి ఉద్దండులు
జాతకచక్రబిరుదాంకితులు
శ్రీశ్రీశ్రీ సిద్దేశ్వరయోగిగారు

లాడ్జి బయట వేళాడకట్టిన బ్యానరును చూసి

## సినారె ఛలోక్తి

నగరంలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో 'కవన వేదిక" ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఏర్పాటుచేశారు. సభకు డా. ఎన్. గోపి అధ్యక్షత వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి అయిన డా. సినారె వేదిక నలంకరించారు. ఆయనతోపాటు ప్రముఖ కవులు డా. ఎస్వీ సత్యనారాయణ (ఎస్వీ), డా. శిఖామణిలుకూడా వేదికపై ఆసీనులైనారు. డా. సినారె తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. "వేదిక నలంకరించిన డా. గోపి.. డా. ఎస్వీ... డా. శిఖా.." అనేసరికి హాలంతా నవ్వులతో నిండిపోయింది. మళ్ళీ సినారె మాట్లాడుతూ "అవును మరి గోపి, ఎస్వీ పేర్లలో రెండక్షరాలే వున్నాయి. శిఖామణి కూడా వాళ్ళతో సమానంగానే వేదిక మీద కూర్చున్నాడు కాబట్టి అందర్నీ సమానంగా చూడాలనే వుద్దేశ్యంతోనే శిఖామణి పేరును 'కట్' చేయడం జరిగింది" అన్నారు. సభికులు మరొక్కసారి మనసారా నవ్వుకున్నారు.

సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు



లోపలికి వెళ్ళి రిసెప్షన్‌లో సిద్దేశ్వరయోగిగారి రూం నెంబర్ కనుక్కొని నేరుగా రూం దగ్గరకు వెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కడం పూర్ణానందం.

లోపల్నుంచి 'కమిన్' అంటూ ఆహ్వానం రావడం తోనెమ్మదిగా తలుపు తెరచుకుని లోపలికి వెళ్ళాడు. ఎదురుగా నల్లబంగార రంగు శరీరచ్ఛాయతో పంచె మాత్రమే కట్టుకుని పైన ఎటువంటి అచ్ఛాదన లేకుండా మెళ్ళో రుద్రాక్షమాలలు, ముంజేతికి కడియం, నుదుటి మీద ఎక్కడా శరీరపురంగు కనబడకుండా గోడకు సున్నం కొట్టినట్టురాసుకున్న విభూది, మధ్యలో ఎర్రటి కుంకుమ బొట్టు, ఎటువంటి గ్రహదోషాల్నయినా తరమి పారేయగల నన్న నమ్మకంతో ఎరుపెక్కి పైకి వుబ్బుకొచ్చిన కళ్ళు చూడగానే ఆయనే సిద్దేశ్వరయోగి అని గ్రహించి నమస్కరించాడు పూర్ణానందం. చిరు నవ్వుతో పూర్ణానందం నమస్కారాన్ని స్వీకరిస్తూ అక్కడే వున్న కుర్చీలో కూర్చోమంటూ సైగచేశారుయోగిగారు.

ఏం పేరు? అడిగారు యోగిగారు.

పూర్ణానందమండి చెప్పాడు.

ఏం పని మీదొచ్చావు?

జాతకం చూపించు కుందామని నసిగాడు పూర్ణానందం.

ఏం చూసి చెప్పమంటావు? అర్థం కానట్టు ముఖం పెట్టాడు పూర్ణానందం.

అదే సంఖ్యాశాస్త్రమా? శరీర శాస్త్రమా?

శరీర శాస్త్రమేనండి.

శరీరంలో ఏ భాగం చూసి చెప్పమంటావు?

తన కేదో జరగబోతున్నదన్న భయం. తొందరగా జాతకం చెప్పించుకోవాలన్న ఆతృతతో మొత్తం చూసి చెప్పండి అనేవాడు పూర్ణానందం.

నవ్వుకున్నారు యోగిగారు. "సరే ఈ కాగితం మీద నువ్వు పుట్టిన తేదీ, నీ పెళ్ళయిన తేదీ, నీ భార్య పేరు వ్రాసివ్వు" అంటూ పక్కనే వున్న లెటర్ ప్యాడ్ నుంచి ఒక కాగితాన్ని చింపి పూర్ణానందానికి ఇచ్చారు యోగిగారు.

"నాకింకా పెళ్ళి కాలేదండి" చెబుతూనే పుట్టిన తేదీని మాత్రం వ్రాసి కాగితాన్ని తిరిగి యోగిగారికి ఇచ్చేశాడు. పూర్ణానందం ఇచ్చిన కాగితాన్ని అందుకుంటూనే అతన్ని దగ్గరగా రమ్మని సైగ చేసేసరికి పూర్ణానందం వెళ్ళి యోగిగారి పక్కనే కూర్చున్నాడు. పక్క కొచ్చి కూర్చున్న పూర్ణానందం ముఖాన్ని, కళ్ళని, ముక్కును, చెవుల్ని, అరచేతి లోని రేఖల్ని, అరికాళ్ళను అరగంట సేపు పెద్ద సైజు భూతద్దంతో పరీక్షించి తరువాత దీర్ఘంగా ఒక నిట్టూర్పు వదిలి కళ్ళు మూసుకున్నారు యోగిగారు.

తమ కష్టాలకి, బాధలకి మానవాతీత శక్తేదో కారణమన్న అభిప్రాయంతో ఆ శక్తి పేరేమిటో, వూరేమిటో సిద్దేశ్వర యోగిలాంటి వాళ్ళ ద్వారా కనుక్కొని సదరు శక్తిగారికి శాంతి పూజలు చేయించడం ద్వారానే తమ కష్టాలన్నీ పంచ భూతాల్లో కలిసిపోతాయన్న నమ్మకంతో, అవివేకంతో వచ్చే వాళ్ళ ముఖ కవళికలను జాగ్రత్తగా పరిశీలించి మామూలుగా మాట్లాడుతూనే వాళ్ళ స్వంత విషయాల్ని రాబట్టం వాళ్ళని మానసికంగా మరింత భయభ్రాంతుల్ని చేసి శనిపూజని, శాంతి పూజని జేబులుకొట్టేయడంలో సిద్ధహస్తుడైన సిద్ధేశ్వర యోగిగారు పూర్ణానందం ముఖంలోని కంగారు, భయం, ఆతృత తేలిగ్గానే పసికట్ట కలి

## అబ్బో.. ఎన్నోసార్లు

"నేను సిగరెట్లు త్రాగడం మానేశాను!" అన్నారు ఆరుద్ర.

"అదేం గొప్ప, నేను అలా చాలాసార్లు మానేశాను!" అన్నారు ముళ్ళపూడి.

• • •

"ఏమిటండి మీ వ్రాత ఇలా వుంటుంది?" అడిగాడు ప్రెస్ కంపోజిటర్.

"అందుకనేనయ్యా, నా రాత ఇలా వుంది!" ముళ్ళపూడి సమాధానం.

—బిడ్డిగం



గారు. కళ్ళు మూసుకొనే పూర్ణానందం పరిస్థితిని అంచనా వేసి నిదానంగా కళ్ళు తెరిచి పూర్ణానందం ఇచ్చిన కాయితం మీద పెద్ద చతురస్రం ఒకటి గీసి దాని మధ్యలో అరంగుళం తేడాతో మరో చిన్న చతురస్రాన్ని గీసి రెండు చతురస్రాల్ని కలుపుతూ మధ్య మధ్యలో గీతలు గీసి రెండు చతురస్రాల మధ్యలో బాక్సులుగా తయారు చేశారు. తరువాత కొద్దిసేపు చేతివ్రేళ్ళు, కాలివేళ్ళు లెక్క పెట్టుకొని శని నాలుగో ఇంట వున్నాడు. శుక్రుడు ఆరో ఇంట వున్నాడు. రాహువు మూడవ ఇంట వున్నాడంటూ వరసగా గ్రహాల పేర్లని చెప్పి ఒక్కో గ్రహానికి ఒక్కో డోరునంబరుకేటాయించేశారు. యోగిగారి అద్భుతమైన నటనని భక్తితో శ్రద్ధగా చూస్తున్నాడు పూర్ణానందం.

డోరు నంబర్ల కార్యక్రమం పూర్తవగానే చేతిలోని కాగితాన్ని పక్కన పెట్టేసి "నీ పేరేంటన్నావు పూర్ణానందం కదూ.ఇప్పటి వరకు పేరుకు తగ్గట్టుగానే కష్టమంటే ఏమిటో తెలీకుండా సాగిపోయింది నీ జీవితం. ఇకనుంచి మాత్రం నిద్రపోయే అవకాశం కూడా కలగనంతగా కష్టాలు ఎదురుకాబోతున్నాయి. మరో రెండు రోజుల్లో మూడు బలమైన గ్రహాలు శని, రాహువు, కేతువులు ముగ్గురు చైను బ్యాచ్‌గా మారి వుమ్మడిగా నీ మీదకు దండెత్తటానికి సిద్ధంగా వున్నారు. ఆ గ్రహాల వక్రబుద్ధి వల్ల నీ జీవితం చిన్నాభిన్నం కాబోతున్నది. గ్రహబలం నుంచి తప్పించుకోవడం అంత సులభం కాదు" చెప్పడం ఆపేసి పూర్ణానందం వైపు చూశారు యోగిగారు. అప్పటికే చెమట్లు పట్టేశాయి పూర్ణానందానికి. పూర్ణానందం అవస్థను గమనించిన యోగిగారు "నువ్వేం భయపడకు.నీ అదృష్టం కొద్ది సరైన సమయంలో నా దగ్గరకు వచ్చావు కాబట్టి సరిపోయింది. ఈ సిద్ధేశ్వర యోగి దగ్గర ఎలాంటి మొండి గ్రహాలైనా తలవంచాల్సిందే" గర్వంగా చెప్పారు యోగిగారు.

గ్రహాల పేర్లు, చైను బ్యాచ్ మూకుమ్మడి దండయాత్ర లాంటి మాటలువినేసరికి చెమటతో తడిసి ముద్దయిపోయి బిక్క మొఖం వేసేసిన పూర్ణానందం యోగిగారి ఆఖరి మాటలువిని సాక్షాత్తు ఆ పరమ శివుడే తన కష్టాలు పోగొట్టడానికి యోగి రూపంలో లాడ్జిలో రూము తీసుకున్నట్టు ఫీలయిపోయాడు.

"నన్నీ గండం నుంచి ఎలాగైనా బయట పడేయండి స్వామి" చేతులు జోడించాడు. ఎదుటివాడు తననుపూర్తిగా నమ్మాడని నిర్ధారించుకున్న యోగిగారు ఏదో ఆలోచిస్తున్నట్టు కొంచెం సేపు మౌనంగా వుండి "నిన్ను చూస్తే జాలేస్తుంది. పైగా ఇంకా పెళ్ళికూడా కాలేదన్నావు. నువ్వేం భయపడద్దు. గ్రహాల బలం ఎంత శక్తివంతమైనదైనా మన ముందు బలాదూరే. కాకపోతే గ్రహశాంతికి కొంచెం ఖర్చవుతుంది" అంటూ ఎంత ఖర్చు అవుతుందో లెక్కలేసి చెప్పారు. యోగిగారు అడిగిన మొత్తానికి మరో పది రూపాయిలు ఎక్కువేసి ఇస్తూ "మరి పూజ ఎప్పుడు మొదలు పెడతారు?" అడిగాడు పూర్ణానందం.

## జీవితం

జీవితమనేది
కవికి కు'సుమం'
రసికుడికి 'వరం'
విప్లవవాదికి
'అరుణబింబం'
అభ్యుదయవాదికి
'చైతన్యం'
దరిద్రుడికి 'శాపం'
వేదాంతికి 'నీటిబుడగ'



—చిమ్మపూడి శ్రీరామమూర్తి


"ఇక అదంతా నేను చూసుకుంటాగా మరో పావుగంటకల్లా పూజ మొదలు పెడతాను. గ్రహాల్తో ఢీకొనేటప్పుడు నీ వంటి అల్పప్రాణులు ఇక్కడ వుండకూడదు. నువ్వు నిశ్చింతగా వెళ్ళి మరో పది రోజుల తర్వాత కనపడు. నేను ఈ రూంలోనే మరో నెల రోజులవరకు వుంటాను. మరో విషయం నువ్వు వెంటనే పెళ్ళి చేసుకో. అమ్మాయి గ్రహబలం బావుంటే అది కూడా నీకు సహాయపడుతుంది" అంటూ సలహా ఇచ్చి పూర్ణానందం ఇచ్చిన డబ్బులు ఎదురుగా టీపాయ్ మీదున్న పుస్తకంలో పెట్టేసి "ఇక నువ్వు వెళ్ళొచ్చు" అన్నట్టు లేచి నిలబడ్డారు యోగిగారు.

** ** **

బ్రతుకు మీద భయంతో తన జీవితం గురించి ఆలోచనతో పడ్డ పూర్ణానందానికి తండ్రి వ్రాసిన వుత్తరం చదివి మొదటిసారిగా చిరాకు పడ్డాడు. తన పెళ్ళి ప్రయత్నాలు ఎంత వరకు వచ్చాయంటూ వ్రాసిన ఉత్తరానికి జవాబుగా "పెళ్ళంటే నూరేళ్ళ పంట.. అందుకే పెళ్ళి విషయంలో తొందర పడకూడదు. మా ప్రయత్నాలు మేము చేస్తూనే వున్నాము. నువ్వు మాత్రం తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు." అంటూ తిరుగుటపా పంపారు పూర్ణానందం నాన్నగారు.

తండ్రి వ్రాసిన వుత్తరాన్ని చూస్తున్న కొద్ది పూర్ణానందంలో చికాకు ఎక్కువైపోతుంది. అతనికి తెలియకుండానే అతని ఆలోచనలు అమ్మానాన్నల మనోభావాలను విమర్శనా దృష్టితో చూడ్డం మొదలు పెట్టాయి.

"నాలుగేళ్ళ నుంచి ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. నాన్న అడిగే లకారాల కట్నం, అమ్మ కోరికలు తీర్చటానికి ముందుకొచ్చేంత స్థోమత కలవాడు బోడి ఎల్.డి.సి. వుద్యోగస్థుడి కోసం ఎందుకు కక్కుర్తి పడ్తాడు. పాతికేళ్ళ నుంచి ప్రైవేటు కంపెనీలో గుమస్తాగిరి చేస్తూ కుక్కతోక బెత్తెడన్నట్టు గడిపిన నాన్న కనీసం కొడుకు






హయాములోనైనా కొడో గొప్ప బ్యాంకు బ్యాలన్స్ వుండాలంటాడు. ఇక అమ్మయితే ఒక్కగానొక్క కొడుకు పెళ్ళిలో తప్ప ఇక అవకాశం రాదనే సత్యాన్ని గ్రహించి ట్రంక్ రోడ్డంత పొడవైన కోరికల లిస్టును జెరాక్సు కాపీలు తీయించుకొని మరీ దగ్గర పెట్టుకుంది. వీళ్ళ కోరికలు తీర్చడానికి చెవిలో పువ్వు పెట్టుకున్నాడెవరో దొరకాలి వీళ్ళకి. వాడు దొరికేలోగా తనుమాత్రం ముసలాడైపోవడమో, చైను బ్యాచ్ గ్రహాల దెబ్బకి 'ఢాం' మంటమో జరుగుతుంది"

ఆలోచనల కందిరీగల్ని దూరంగా తరిమేస్తున్నట్టుగా తలను గట్టిగా ఒకసారి విదిల్చి మరింత గట్టిగా ఒక నిర్ణయానికి వచ్చేసి గ్రహబలం బారి నుంచి తప్పించుకోవడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు వెళ్ళివీధిలో నిలబడి తలెత్తి చుట్టూచూడ్డం మొదలు పెట్టాడు పూర్ణానందం.

** ** **

మొన్నటి మొన్న "అమ్మాయిని చూసి కన్నుకొట్టాడు, అమ్మాయిని చూసి పళ్ళికిలించాడు" అంటూ ఆ కుర్రాడు కనబడినప్పుడల్లా మెటికలు విరుస్తూ శాపనార్థాలు పెట్టిన జగదాంబ ఆ కుర్రాణ్ణే అల్లుడిగా చేసుకుందంట.

అయినా ఆ కుర్రాడికి ఇదేం పోయేకాలం. వాళ్ళ కులంలో అమ్మాయిలే కరువైనట్టు జగదాంబ కూతురే దొరికిందా? కనీసం వాళ్ళ అమ్మానాన్నలక్కూడా తెలీకుండా గుళ్ళో దొంగ పెళ్ళి చేసుకున్నాడంట.

> ### 'కృష్ణపక్ష' చంద్రుడు
>
> ఒకసారి నెల్లూరు టౌన్ హాల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి సన్మానం జరుగుతోంది. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు సన్మానం చేస్తుండగా హాల్లో ఒక్కసారిగా లైట్లు ఆరిపోయాయి. చిక్కని చీకటి ఆవరించింది. అయితే, మరికొన్ని క్షణాల్లోనే 'కరెంటు' వచ్చింది.
>
> "ఈ కృష్ణపక్ష చంద్రుడు వేదిక మీదుండగా చీకటి జడుసుకొని పారిపోయింది చూడండి" అంటూ గోపాలరెడ్డిగారు చమత్కరించగా సభలో ఒకటే చప్పట్లు.
>
> — సేకరణ: హిమజారమణ

దొంగ పెళ్ళేం కాదులే. ప్రేమ పెళ్ళంట. వాళ్ళ ఆఫీసులో వాళ్ళంతా దగ్గరుండి మరీ జరిపించారంట.

తన పెళ్ళి ఆ వీథిలోని పబ్లిక్ కుళాయి దగ్గర పెద్ద చర్చనీయాంశం అయిందని తెలిసినా ఏ మాత్రం తల దించకుండా ఠీవిగా అడుగులువేస్తూ భార్యా సమేతంగా స్వామి వారి దీవెనల కోసం లాడ్జికి బయలుదేరాడు పూర్ణానందం.

** ** **

పూర్ణానందంగారికి,

మీ పెళ్ళికి నన్ను పిలవక పోయినా మీరు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారని తెలిసి చాలా సంతోషించాను. పెళ్ళి చేసుకున్న వెంటనే దీవెనల కోసం యోగి (మీ దృష్టిలో స్వామిగారు) గారి దగ్గరకు వస్తారని తెలుసు. కాని మీకు తెలియని విషయం ఏమిటంటే, ఆ రోజు పూజ కోసం మీరిచ్చిన డబ్బుతో తప్పతాగి మీలాగే జాతకాల పిచ్చితో జాతకం చూపించుకోవడానికి వచ్చినావిడ మీద అఘాయిత్యం చేయబోయి భంగపడి లాడ్జి మేనేజరు గారి చలవతో యోగిగారి ప్రస్తుతం రిమాండులో వున్న ఖైదీలకు జాతకాలు చూస్తూ చాలా బిజీగా వున్నారు. కాబట్టి మరో ఐదేళ్ళ వరకు మీకు యోగిగారి అపాయింట్‌మెంట్ దొరకదు. కాబట్టి యోగిగార్ని కలిసే ప్రయత్నం మానుకోవలసింది.

బల్లి మీద పడగానే ఏదో జరుగుతుందని భయపడ్డ మీకు ఏ పెళ్ళయితేనేం మొత్తానికి పెళ్ళి జరిగిపోయింది. మీకు పెళ్ళయిన శుభ సందర్భంగా నాదో చిన్న మనవి. ఇక నుంచి గ్రహాల అనుగ్రహం అంటూ పిచ్చి పిచ్చిగా తిరక్కుండా బుద్ధిగా ఇంట్లో వుండి మీ ఆవిడగారి అనుగ్రహం సంపాదించి ముచ్చటగా ఇద్దరు పిల్లల్తో సుఖ సంతోషాలతో జీవిస్తారని ఆశిసూ.. ◆


ESTD: 1964

DURABLE FOR SEVERAL YEARS
SREE GOLD COVERING WORKS
SREE
MACHILIPATNAM

30 YEARS SERVICE

మా సేల్స్ బ్రాంచీలు:

(1) స్టాల్ నెం.2, పట్టాభిమార్కెట్, మచిలీపట్నం. (2) శేషయ్యస్ట్రీట్, విజయవాడ-1. (3) ఏలూరురోడ్, విజయవాడ-2. (4) 17/317, ట్రంక్‌రోడ్, నెల్లూరు. (5) 141 జి, కార్ స్ట్రీట్, తిరుపతి, ఫోన్: 22085. (6) 50, గాంధీరోడ్, తిరుపతి. (7) రామర్ కోయిల్ స్ట్రీట్, చిత్తూరు. (8) 14/43, సుభాష్‌రోడ్, అనంతపురం. (9). మద్రాసురోడ్, కడప. (10) నెం.14, మునిసిపల్ బిల్డింగ్స్, కర్నూలు. (11) నెం.212, బి1,నాగులకుంటరోడ్, నంద్యాల. (12) 181, బసవన్నదేవాలయం వీథి, అవెన్యూరోడ్ క్రాస్, బెంగుళూరు-53. ఫోన్: 266419. (13) గాంధీ బజార్, బెంగుళూరు-4. (14) 86, జయంతి బిల్డింగ్స్, అవెన్యూరోడ్, బెంగుళూరు-2, ఫోన్:210080. (15) 77-1, కళ్యాణ్ బిల్డింగ్స్, బాలేపేట, బెంగుళూరు-53. (16) మునిరెడ్డిపాలెం, బెంగుళూరు. (17) క్యాదరత్‌రోడ్, బెంగుళూరు. (18) గాంధీబజార్, షిమోగా

PHONES: OFFICE: 2785
RESI:2235

30 సంవత్సరాలుగా మీ ఆదరణ పొందిన సంస్థ

శ్రీ నగలు



శ్రీ గోల్డు కవరింగ్ వర్క్సు®

P.B.No:35, శ్రీ మహల్, మచిలీపట్నం-2 (A.P)

1. డీలరు షిప్పు ఇవ్వబడును.

2. అన్ని ముఖ్యపట్టణములలో మా డీలర్లు కలరు.